చంద్రబాబును ప్రజలు నమ్మరు

- రోజుకో మాట మార్చడం బాబు నైజం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అన్నవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: ఎప్పటికప్పుడు మాటలు మార్చే చంద్రబాబును రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని చిట్టివలస, మండలంలోని అన్నవరం పంచాయతీలో 'జగనన్న సురక్ష'పై వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 73 ఏళ్ల చంద్రబాబు గత నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రకరకాల విమర్శలు చేశారన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తాము కూడా అమలు చేస్తామన్నారన్నారు. సచివాలయాలు పనికిరావని, వలంటీర్లు సంచులు మోయాలని గతంలో చంద్రబాబు ఎగతాళి చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు సీఎం జగన్‌ను ఆదర్శంగా తీసుకుని సచివాలయాలు, వలంటీర్లు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. భీమిలి మండలంలోని 16 పంచాయతీలు, 13 సచివాలయాల పరిధిలో 900 కుటుంబాలకు రూ.9 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. నియోజకవర్గంలో రూ.100 కోట్ల విలువైన ఇళ్ల స్థలాలు 8 వేల మందికి అందించామని తెలిపారు. నూరు శాతం సంక్షేమ పథకాల అమలుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు.

92 శాతం మందికి సంక్షేమ పథకాలు

జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా 92 శాతం మందికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద 11 రకాల సేవలు అందిస్తామన్నారు. కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, మ్యుటేషన్ లావాదేవీలు, పంట సాగు హక్కు, రైస్ కార్డులు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన వంటివి ఉచితంగా జూలై నాటికి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. వీటిని ముఖ్యమైన టాస్క్‌గా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు భావించాలని సూచించారు. అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణ, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వేణురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మేరుగు సంతోషికుమారి, కాద సూర్యనారాయణ, చెల్లూరి నగేష్, సమ్మిడి శ్రీనివాసరావు, పొట్నూరు చంద్రశేఖర్, బొడ్డు దుర్గారావు, వెంపాడ సూరిబాబు, పల్లా సన్యాసిరావు, బోని సన్నిబాబు, చిల్ల హరి, సింగపూర్ బుజ్జిరాజు, కొల్లి కోటిరెడ్డి, తుపాకుల అప్పలరాజు, శిరిగుడి ఈశ్వరరావు పాల్గొన్నారు. చిట్టివలసలో జరిగిన కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు పి.బాలరాజు, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, అల్లిపల్లి నరసింగరావు, నమ్మి లక్ష్మణ, సీనియర్ నాయకులు శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిప్పాడ వెంకటేష్, ఉప్పాడ నాగేశ్వరరావు, బింగి హరికిరణ్, జీవీ రమణ పాల్గొన్నారు.

నిర్దేశించిన సర్వే లక్ష్యాలు పూర్తి చేయాలి



సర్వే సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ విశ్వనాథన్

ఆనందపురం : సర్వే బృందాలకు నిర్దేశించిన లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. ఆనందపురం, గంభీరం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముగ్గురితో కూడిన బృందం రోజుకు 18 ఎకరాలు సర్వే చేయాల్సి ఉంటుందని చెప్పారు. అలా చేస్తేనే అనుకున్న లక్ష్యాన్ని తొందరగా పూర్తి చేసి వివరాలు త్వరితగతిన ఆన్‌లైన్ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. సర్వే వివరాల నమోదు సమయంలో రైతుల వద్ద ఉన్న హక్కు పత్రాలను పరిశీలించాలని సూచించారు. ఆయకట్టు చెరువులు, కాలువలు, గెడ్డల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు.

'జగనన్న సురక్ష'పై సూచనలు

ఆనందపురం సచివాలయాన్ని జేసీ విశ్వనాథన్ శనివారం సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి క్లస్టర్లు వారీగా ధ్రువపత్రాల వివరాలు సేకరించాలని సూచించారు. అధికారుల బృందం వచ్చే సమయానికి ప్రజల నుంచి వచ్చిన వినతులకు ధ్రువపత్రాలు జత చేసి ఉంచాలన్నారు. జేసీ వెంట తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, ఆర్ఐ మరణికంఠ, సర్పంచ్ చందక లక్ష్మి, కార్యదర్శి శ్రీరామమూర్తి, వీఆర్వో అప్పలరాజు తదితరులు ఉన్నారు.

క్లాప్ వాహనాల సిబ్బందికే చెత్త ఇవ్వండి



చిల్లపేటలో అవగాహన కలిగిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: ఇంటి ముందుకు వచ్చే క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల సిబ్బందికే తడి, పొడి, ప్రమాదకరమైన చెత్తను విభజించి ఇవ్వాలని భీమిలి జెడ్సీ బి.రాము కోరారు. భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేటలో చెత్త సేకరణపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిథిన్ వినియోగం, చెత్తను రోడ్ల పక్కన, డ్రైనేజీల్లో వేయడం వల్ల ఎదురయ్యే అనర్థాలను వివరించారు. అనంతరం భీమిలి రోడ్డులో డ్రైనేజీల్లో పూడిక తొలగిస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. జీరుపేట గ్రామం లోపలికి వెళ్లే కల్వర్టు కిందకు దిగిపోయినందున మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు. అలాగే డ్రైనేజీలను దాటడానికి స్థానికులు వేసిన పైప్‌లైన్లు, స్తంభాల వల్ల పూడికతీతకు కష్టంగా ఉందని సిబ్బంది చెప్పడంతో వాటిని జెడ్సీ పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించేందుకు కృషి



సచివాలయ సిబ్బందితో శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు అన్నారు. వార్డులోని 56వ సచివాలయం వద్ద పలువురు సచివాలయ సిబ్బంది, గృహసారథులు, నాయకులతో శనివారం సాయంత్రం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి అర్హుల జాబితా తయారు చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఏమైనా సాంకేతిక కారణాల వల్ల అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తమ్మినేని వరలక్ష్మి, సత్యం బాబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని స్థానిక సబ్ స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు బోని రోడ్డు ప్రాంతంలో ఉన్న గ్రామాలకు, ఆనందపురం, లొడగలవానిపాలెం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థుల బాధ్యత ఉపాధ్యాయులదే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు

పద్మనాభం: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయులు బంగారు బాటలు వేయాలని జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఆర్.వి.పురం ప్రాథమిక, రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన విద్య అందించాలని సూచించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థుల బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. పాఠశాల వయస్సు గల పిల్లలు బడి బయట ఉండకూడదన్నారు. మానవ విలువలు, సమాజం పట్ల బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన అన్ని తరగతులను సందర్శించారు. జగనన్న విద్యా కానుకలు అందరికీ అందాయా..? లేదా..? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. ఆయన వెంట డీఈవో ఎల్.చంద్రకళ, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, తహసీల్దార్ టి.శ్రీవల్లి, ఎంఈవో – 2 బాబూలాల్ ఉన్నారు.

ఉషారాణి సేవలు ప్రశంసనీయం



ఉషారాణిని సన్మానిస్తున్న రాంబాబు, తదితరులు

పద్మనాభం: ఈవోఆర్డీగా ఎం.ఉషారాణి అందించిన సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం ఈవోఆర్డీగా పని చేసి దుంబ్రిగుడ ఎంపీడీవోగా పదోన్నతిపై వెళ్లిన ఉషారాణిని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈవోఆర్డీగా ఉషారాణి నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. అనంతరం ఉషారాణిని ఎంపీపీ రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ సన్మానించి మెమెంటో అందజేశారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ ఏవో పి.రాధ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన నేడు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన శ్రీ నటరాజ నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

యువతి అదృశ్యం

పీఎం పాలెం : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రాంతానికి చెందిన డి.సుందరరావు కుమార్తె దివ్య (27) జీవీఎంసీ ఆరో వార్డులోని కె -1 కాలనీలో నివసిస్తున్న పిన్ని ఇంటికి వారం రోజుల కిందట వచ్చింది. అక్కడి నుంచి ఈ నెల 19న సాయంత్రం బయటకు వెళ్లిన దివ్య మరలా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో దివ్య తల్లి ఇందిర పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు

రహదారిపై మురుగునీటితో సమస్యలు



చిప్పాడ సచివాలయం ముందు రహదారిపై మురుగునీరు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ గ్రామ సచివాలయం ఎదురుగా చెరకుపల్లి – అన్నవరం రహదారిపై మురుగునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీల కోసం చేపట్టిన తవ్వకాల్లో రోడ్డు పక్కన నిలిచిన నీరు రహదారిపైకి చేరి వాహనాల రాకపోకల సందర్భంగా పక్కనున్న వారిపై తుళ్లుతోంది. ఈ క్రమంలో రహదారిపై గొయ్యి ఏర్పడింది. ఈ గుంతలో పడి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో స్థానికులు తాత్కాలికంగా రహదారిపై గుంత ఏర్పడిన చోట రాళ్లు, కర్రలు పెట్టి ఎర్రటి వస్త్రాన్ని కట్టి ఉంచారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో మురుగునీటిని దిగువకు మళ్లించి ప్రమాదాల నివారణకు, వాహనాల రాకపోకలకు అనువుగా గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, కమిషనర్ సాయికాంత్ వర్మ

అరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలిసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏయే వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదవుతోందో సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్శనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివారావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్–2 జెడ్సీ కనకమహాలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

పేదరికాన్ని పారదోలేలా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మంచినీటి పథకం నిర్మాణం కోసం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని గంభీరం పంచాయతీ దుక్కవానిపాలెంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరే విధంగా పథకాలకు రూపకల్పన చేసి అమలు జరుపుతున్న దేశంలో ఏకైక ప్రభుత్వం మనదేనన్నారు. అర్హత ఉండి పథకం అందలేదని ఏ ఒక్కరి నోటి వెంట రాకూడదనే ×జగనన్న సురక్ష¤ కార్యక్రమం అమలుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. గతంలో ఏ పథకం ద్వారా అయినా లబ్ధి పొందాలంటే దరఖాస్తు చేసుకోవడానికి కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. పద్ధతి లేకుండా సాగిన టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాలన్నా లంచం ఇస్తే గానీ పని జరిగేది కాదన్నారు. నేడు అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. సగటు మనిషి అవసరం గుర్తించి వివిధ పథకాల ద్వారా లబ్ధిని నేరుగా అందిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో దళారీ వ్యవస్థ పూర్తిగా నిరోధించామని చెప్పారు. టీడీపీ నేత చంద్రబాబు నాయుడు ఊరూరా తిరుగుతూ ప్రజలను మోసం చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. పాలిచ్చే ఆవు జగన్ మోహన్‌రెడ్డి అయితే, ఉట్టిపోయిన ఆవు లాంటి వాడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. దుక్కవానిపాలెంలో రూ.1.64 లక్షలతో సంక్షేమ పథకాలు అమలు పరిచి రూ.4.49 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. ఈ సందర్భంగా రూ.43 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వైస్ ఎంపీపీ బొట్టా ధనలక్ష్మి, పార్టీ సీఈసీ సభ్యుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రింకి అప్పారావు, నాయకులు ఇలిపిల్లి నరిసింగరావు, బొట్టా రామకృష్ణ, బోయి వెంకటరమణ, వర్షం వెంకట్, బంక మహేష్, బీఆర్‌బీ నాయుడు, ఉప్పాడ సూరిబాబు, కోరాడ ముసిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

ఎంవీపీకాలనీ: బాలకార్మికుల నిర్మూలనపై జిల్లా లేబర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఎంవీపీ కాలనీతో పాటు గాజువాక, దువ్వాడ, గోపాలపట్నం ప్రాంతాల్లో శనివారం ఈ తనిఖీలు జరిగాయి. లేబర్ డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుల ప్రత్యేక బృందం ఈ తనిఖీలను నిర్వహించింది. పలు షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న బాలబాలికలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. వారిని పనుల నుంచి విముక్తులను చేయడంతోపాటు యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా పలువురు బృందం సభ్యులు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, వినియోగదారుల ఫోరం అధికారులు పాల్గొన్నారు.

బొండా కుటుంబ సభ్యులకు పరామర్శ



బొండా వెంకట సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న రమేష్ బాబు

మహారాణిపేట: ప్రమాదవశాత్తు మృతి చెంది అవయవదానం చేసిన బొండా వెంకట సంతోష్ కుమార్ (వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు) కుటుంబ సభ్యులను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతోపాటు రీజినల్ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాణ మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, సీనియర్ నాయకులు వాసపల్లి ఈశ్వరరావు, చొక్కర శేఖర్, జి.విక్టర్, వెంకట్, ధూళి రఘు, నల్లా రవి, పతివాడ కనకరాజు ఉన్నారు.

పేట జంట గ్రామాలకు తాగునీటి సమస్య

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేట, జీరుపేట గ్రామాలను నాలుగు రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. ఇటీవల చిల్లపేట చెరువును ఆనుకుని డ్రైనేజీల్లో పూడిక తొలగిస్తుండగా ఈ గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లను జేసీబీతో పలుచోట్ల పెకిలించి వేశారు. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసినా పూర్తిస్థాయిలో అందరికీ అందడం లేదని వాపోతున్నారు. పైప్‌లైన్లకు మరమ్మతులు నిర్వహించి తాగునీరు సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

'టీ విక్రయదారులే పాలిథిన్ సంచుల సరఫరాదారులు'

తగరపువలస: స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లో టీ విక్రయదారులే విచ్చలవిడిగా పాలిథిన్ సంచులు వ్యాపారులకు సరఫరా చేస్తున్నారని భీమిలి జోన్ సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఎంత కట్టడి చేసినా మార్కెట్‌ను ఆనుకుని ఇల్లు కలిగిన అప్పారావు అనే వ్యక్తితోపాటు అతని భార్య టీ విక్రయం పేరుతో మార్కెట్‌లోని వ్యాపారులందరికీ పాలిథిన్ సంచులు సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అతని ఇంటిని సోదా చేయడానికి కొందరు అడ్డం పడుతున్నారని సచివాలయ సిబ్బంది అంటున్నారు. మార్కెట్ మొత్తం మీద చేపలు, చికెన్, కూరగాయల వ్యాపారులు యథేచ్ఛగా పాలిథిన్ సంచులు వినియోగిస్తూ నిషేధానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. పాలిథిన్ సంచులను అప్పారావు ఎక్కడ నిల్వ చేశాడో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని సిబ్బంది చెబుతున్నారు.

2 కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత

గోపాలపట్నం: లిక్విడ్ గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. శనివారం సాయంత్రం ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద అక్రమంగా వీడ్ ఆయిల్‌ను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2 కిలోల వీడ్ ఆయిల్(లిక్విడ్ గంజాయి), రూ.4,020 నగదు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు లిక్విడ్ గంజాయిని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నరసింహావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం: జగన్నాథుని రథోత్సవాల్లో భాగంగా స్వామి వారు శనివారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.సింగరాచార్యులు పూజలు చేసి, భక్తులకు ఈ అవతారం విశిష్టతను వివరించారు.

కాలనీ లబ్ధిదారులతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న లబ్ధిదారులు, అధికారులు

ఆనందపురం : ఆనందపురంలోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కాలనీ లబ్ధిదారులతో అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఏఈ లోక్‌నాథం మాట్లాడుతూ పీఎం ఏవై పథకం ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తయిందని చెప్పారు. ఈ మేరకు లబ్ధిదారులను కలిసి పథకం ప్రయోజనాలను వివరించామని చెప్పారు. పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులు కాలనీ ఇళ్లు పరిశీలించారు. సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చందక సూరిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

సప్లిమెంటరీలో 43 శాతం ఉత్తీర్ణత

మధురవాడ: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎమ్.రాజబాబు చెప్పారు. గత మార్చిలో నిర్వహించిన పరీక్షలకు మొత్తంగా 863 మంది హాజరుకాగా 562 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు 301 మంది హాజరుగా కాగా 43 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని, వీరితో కలిపి మొత్తంగా 692 మంది పాసవడంతో 80 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు.

ఎస్‌వోఈ ప్రిన్సిపాల్‌గా విశ్వనాథం



బాధ్యతలు చేపట్టిన విశ్వనాథం

మధురవాడ: మారికవలసలోని ఏపీ గిరిజన గురుకుల సంక్షేమ బాలికల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎస్‌వోఈ) ప్రిన్సిపాల్‌గా కె.విశ్వనాథం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డి.లక్ష్మణరావు పార్వతీపురం జిల్లాకి బదిలీ కాగా ఆయన స్థానంలో సీతంపేట ఆర్‌జేసీ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన విశ్వనాథం బదిలీపై వచ్చారు. క్యాంపస్‌లోనే అందుబాటులో ఉంటూ బాలికల విద్యాభివృద్ధి, ఉత్తీర్ణతా శాతం మరింత పెంచడానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

మధురవాడ: పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్టు మీటర్లు పెట్టాలన్న ఆలోచనను విరమించుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మధురవాడలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ, సీపీఎం, టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంస్కరణలతో బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల కంటే ఏపీలోనే రూ.50 వేల కోట్ల భారం మోపారన్నారు. సీపీఐ మధురవాడ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, గొల్లంగి ఆనంద బాబు, దాసరి శ్రీనివాస్, పి.రాజ్‌కుమార్, ఎండీ బేగం, భారతి పాల్గొన్నారు.